క్లుప్తంగా

దివ్యాంగుడిపై దాడి హేయం

నాదెండ్ల: బీసీ కులానికి చెందిన ఓ దివ్యాంగుడిపై టీడీపీ కార్యకర్తలు చేసిన భౌతికదాడిని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజి ఖండించారు. గణపవరం శాంతినగర్‌లో నివాసం ఉండే దివ్యాంగుడు జువ్వాజి అశోక్‌పై మంగళవారం రాత్రి 15 మంది టీడీపీ కార్యకర్తలు దాడి చేయటం దుర్మార్గమన్నారు. దాడికి పాల్పడిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. బుధవారం అశోక్‌బాబును పరామర్శించారు.

బీసీలను గుర్తించింది జగనన్నే

నరసరావుపేట: గత ఐదేళ్ల నుంచి బీసీలకు అత్యధిక ప్రాధాన్యత నిస్తూ సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు వడ్డెర వర్గీయులు ఓటువేసి సహకరించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. ఎమ్మెల్యే, అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చేసిన సూచన మేరకు వడ్డెర నాయకులు పట్టణంలోని ఒకటి, ఐదు, 25, 26లతో పాటు వివిధ ప్రదేశాల్లో ఉన్న వడ్డెర కుటుంబాలను కలిసి గత ఐదేళ్లుగా అందజేసిన సంక్షేమం, చేసిన అభివృద్ధిపై ముద్రించిన కరపత్రాన్ని గడప గడపకు అందజేశారు. వచ్చే ఎన్నికల్లో పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ పి.అనీల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే గోపిరెడ్డిలను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చల్లా శ్రీనివాసరావు, పట్టణ బీసీసెల్ అధ్యక్షుడు అచ్చి శివకోటి, ఆంధ్రప్రదేశ్ యువజన వెనకబడిన తరగతుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల వెంకటేష్, రాష్ట్ర వడ్డెర నాయకులు మక్కిల మల్లికార్జునరావు, వేముల నాగేశ్వరరావు, తమ్మిశెట్టి అచ్చయ్య, అలుగుల కొండలు, మక్కెల వాసు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా కొనుగోళ్లు

శావల్యాపురం: మండలంలోని అన్నీ రైతుభరోసా కేంద్రాల పరిధిలో కందులు కొనుగోలు పారదర్శకంగా జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి పల్లపోతుల ప్రవీణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మండలంలోని తొమ్మిది రైతుభరోసా కేంద్రాల పరిధిలో 193 మంది రైతుల వద్ద నుంచి 319.65 మెట్రిక్ టన్నులు ప్రభుత్వ నిబంధనల మేరకు కొనుగోలు చేశామన్నారు. కందులు అమ్మిన రైతుల బ్యాంకు ఖాతాలో ఇప్పటి వరకు రూ.29.58 కోట్ల రూపాయల నగదు ప్రభుత్వం జమ చేసిందన్నారు.

చలివేంద్రం ప్రారంభం



శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురం గుంటూరు–కర్నూలు జాతీయ రహదారి మార్గం ప్రధాన కూడలిలో శ్రీరామా పబ్లిక్ స్కూలు సుజరిత ఎడ్యుకేషనల్ సొసైటీ వారి సారథ్యంలో ఉచిత చలివేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సుచరిత సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు కె.వి.ఆర్.మోహన్ చందు మాట్లాడుతూ గత 15 సంవత్సరాల నుంచి వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడానికి స్వచ్ఛందంగా తాటాకు పందిరి వేసి మట్టికుండల్లో తాగునీరు పోసి ప్రజల దాహార్తిని తీర్చుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కామినేని లక్ష్మీనారాయణ, పెదమదార్, రెడ్డి జ్వాలా నరసింహా రావు, మద్దం చౌడయ్య తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

నాదెండ్ల: గణపవరం సీఆర్ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలోని కేంద్రియ విద్యాలయంలో ఒకటో తరగతిలో చేరేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపల్ సునీతాసింగ్ తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి 15వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 1వ తేదీ నాటికి ఆరేళ్లు నిండి ఉండాలన్నారు. మొదటి ప్రాధాన్యతగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు, రెండో ప్రాధాన్యతగా ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగుల పిల్లలకు కల్పిస్తామన్నారు. మిగిలిన ఖాళీల్లో రిజర్వేషన్ ఆధారంగా భర్తీ చేయనున్నట్లు తెలిపారు. నాలుగు, పదో తరగతిలో ఉన్న ఖాళీలను కూడా భర్తీ చేస్తామన్నారు. విద్యార్థులు కేంద్రియ విద్యాలయ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నిందితుడి అరెస్ట్

నరసరావుపేట టౌన్: అక్రమ మద్యం కేసులో నిందితుడ్ని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 13 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నయనతార బుధవారం తెలిపారు. నకరికల్లు మండలం రూపెనగుంట్ల గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. అక్కడ 13 బాటిళ్ల మద్యం కలిగి ఉన్న తన్నీరు శ్రీనివాసరావును అరెస్ట్ చేశామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

రొంపిచర్లలో ఇఫ్తార్ విందు

రొంపిచర్ల: పవిత్ర రంజాన్ మాసంలో కఠోర ఉపవాస దీక్షలు పాటిస్తున్న ముస్లిం సోదరులకు రొంపిచర్ల మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు పడాల చక్రారెడ్డి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును అందించారు. స్థానిక మసీదులో ప్రార్థనలు అనంతరం ఇఫ్తార్ విందును అందించారు. ఈ కార్యక్రమంలో ఉపవాస దీక్షలు తీసుకున్న ముస్లిం సోదరులతో పాటు గ్రామానికి చెందిన పడాల వీరారెడ్డి, కల్లి వెంకటరెడ్డి, కల్లి వెంకటప్పారెడ్డి, పులగం కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

నడచి రాలేక పోతున్నానయ్యా



అనారోగ్యం.. నడిచి రాలేనయ్యా... ఇప్పుడు నడవలేక ఇక్కడిదాకా వచ్చా. గతంలో పింఛను ఇంటికి వచ్చి వలంటీరు ఇచ్చేవాడు. ఇప్పుడు ఆఫీసుకు వచ్చి తీసుకోమని చెబుతున్నారు. ఈ ఐదేళ్లలో ఎన్నడూ ఇలా జరగలేదయ్యా. సీఎం జగన్‌బాబు ఇంటికే పంపేవాడు. ప్రతిపక్షాల కుట్ర ఇది.

–కోటమ్మ, 26వ వార్డు, పెద్దచెరువు, నరసరావుపేట

తెల్లవారక ముందే ఇచ్చేవారు



ప్రతినెలా తెల్లవారుజామునే వలంటీరు నిద్రలేపి మరీ పింఛను చేతికిచ్చి వెళ్లేవాడు. ఇవాళ సచివాలయం చుట్టూ తిరుగుతున్నా. ఈ ఐదేళ్లలో ఎప్పుడూ ఈ సమస్య ఎదురుకాలేదు. పింఛను డబ్బు వస్తే మందుల కొనుగోలుకు ఉపయోగపడేవి. ఇంత సేపు పడిగాపులు ఎప్పుడూ పడలేదయ్యా.

–బత్తుల నరసింహం, 26వ వార్డు, పెద్దచెరువు, నరసరావుపేట

ఎక్కలేక, దిగలేక ఇబ్బందిగా ఉంది



నా వయస్సు 73 ఏళ్లు, మా సచివాలయం బాబాపేట పై అంతస్తులో ఉంది. పింఛన్‌కోసం ఉదయం 10 గంటలకు వచ్చి అడిగితే సాయంత్రం రమ్మన్నారు. ఇప్పుడు నాలుగు గంటలకు వచ్చి అడిగితే మరో గంట ఆగాలని చెప్పారు. ఈ వయస్సులో ఎక్కను, దిగను చాలా కష్టంగా ఉందయ్యా.

–షేక్ పెదమస్తాన్, 7వ వార్డు, బాబాపేట, నరసరావుపేట

బాబూ.. మా మీదా నీ అక్కసు?



వలంటీర్లు ప్రతిరోజూ తెల్లవారుజామునే వచ్చి ఇచ్చేవారు. చంద్రబాబు మొనగాడు అయితే మరో విధంగా తేల్చుకోవాలేకాని మాలాంటి వృద్ధులపై అక్కసు ఎందుకు. పింఛను డబ్బులు పెద్దలకు చాలా ముఖ్యం. మామీద రాజకీయం చేసిన వారికి ఉసురు తగలకు తప్పదు.

– వెంకటేశ్వరరెడ్డి, 26వ వార్డు, పెద్దచెరువు, నరసరావుపేట పట్టణం

అప్పుడే బాగుంది



వలంటీరు ఇంటికి వచ్చి పింఛను అందించినప్పుడే బాగుంది. అలాంటి వ్యవస్థపై దుర్మార్గపు ఆలోచనలు చేయడం ప్రతిపక్షాలకు తగదు. ఎప్పుడూ ఇంటికి తెచ్చి ఇచ్చే పింఛను కోసం ఇవాళ సచివాలయానికి రావాల్సి వచ్చింది. మళ్లీ పడిగాపులు తప్పడం లేదు.

–వేముల వెంకట నరసమ్మ, పెద్దచెరువు, నరసరావుపేట

పింఛన్ కోసం ఇంత దూరం రాలేమయ్యా!



రొంపిచర్లలో పింఛన్ కోసం ఎదురు చూస్తున్న వృద్ధులు



గణపవరంలో ఒకటో సచివాలయం వద్ద వృద్ధుడికి పింఛను అందిస్తున్న సచివాలయ సిబ్బంది



నరసరావుపేటలో పింఛను కోసం వస్తున్న అవ్వ

- సచివాలయాల ఎదుట పండుటాకుల ఆవేదన
- ప్రతిపక్షాల తీరుపై సర్వత్రా నిరసన

నరసరావుపేట: పింఛన్ల కోసం ఇంత దూరం తిరగలేం.. ఐదేళ్ల నుంచి మాకు ఈ బాధ లేదు. ఉదయాన్నే ఇంటి తలుపు తట్టి పింఛన్ ఇచ్చేవారు. ఇప్పుడు కష్టాలు పడుతున్నామంటూ పండుటాకులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినెలా ఒకటో తేదీనే ఇచ్చే పింఛన్ ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడు వలన అస్తవ్యస్తంగా తయారైంది. వలంటీర్లను ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో తప్పించాలని టీడీపీ నాయకులు చేసిన ఫిర్యాదు మేరకు ఎన్నికల కమిషన్ ఈనెల నుంచి పింఛన్ పంపిణీ బాధ్యతల నుంచి తప్పించింది. దీంతో పండుటాకుల కష్టాలు మొదలయ్యాయి.

గత టీడీపీ ప్రభుత్వంలో తమ చుట్టూ తిప్పితిప్పి చివరకు ఇచ్చేవారు. దీంతో అనేకమంది తీవ్ర కష్టాల పాలయ్యారు. గత ఐదేళ్ల నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పండుటాకుల కష్టాలను తెలుసుకొని వలంటీర్ల సహాయంతో ప్రతినెలా మొదటి రోజే ఇంటివద్దకు వెళ్లి ఇచ్చే విధంగా వ్యవస్థను తయారు చేశారు. దీంతో పింఛన్ పొందటంలో ఎటువంటి కష్టాలను ఎరుగని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు ఇప్పుడు సచివాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చింది.

నాదెండ్లలో ...

నాదెండ్ల: మండలంలో వైఎస్సార్ పింఛన్ కానుక–సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ బుధవారం ప్రారంభమైంది. సాయంత్రం 7 గంటల సమయానికి 60 శాతం పైగా పింఛన్ల పంపిణీ పూర్తయింది. మండల పరిధిలో 9715 మంది పింఛను లబ్ధిదారులుండగా, రూ.2,88,54,000లు పంపిణీ చేయాల్సి ఉంది. నాదెండ్లలో ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్, తహసీల్దార్ డీవీబీ వరకుమార్ పింఛన్లు పంపిణీ ప్రారంభించారు. ఎక్కువ శాతం వృద్ధులు, వికలాంగులు, సచివాలయాల వద్దకు వచ్చి పింఛను తీసుకున్నారు. కొన్ని సచివాలయాల పరిధిలో సచివాలయ సిబ్బంది ఇళ్లకు వెళ్లి పింఛను పంపిణీ చేశారు. బ్యాంకుల్లో నగదు డ్రా చేయటం ఆలస్యం కావటంతో పంపిణీ మధ్యాహ్నం ప్రారంభమైంది. అప్పటికే సచివాలయాల వద్దకు భారీగా లబ్ధిదారులు చేరుకున్నారు. మేజర్ పంచాయతీ గణపవరంలోని నాలుగు సచివాలయాల పరిధిలో 2334 మందికి పింఛన్లు అందజేయాల్సి ఉండగా, సాయంత్రం 6.30 గంటల సమయంలో తహసీల్దార్ డీవీబీ వరకుమార్ పరిశీలించారు. ఈ నెల 6వ తేదీ వరకూ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.



వినుకొండ సచివాలయంలో చెట్ల కింద పింఛన్ కోసం ఎదురు చూస్తున్న లబ్ధిదారులు

బాబూ! ఎంత కష్టం తెచ్చావ్!

వినుకొండ(నూజెండ్ల): రోజులు మారాయి... నిన్నా మొన్నటి వరకు ఇంటి వద్దనే పింఛన్లు తీసుకున్న వృద్ధులు, వికలాంగులు, వితంతువులు పింఛన్ కోసం గ్రామ, వార్డు సచివాలయాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ప్రతిపక్ష టీడీపీ నేత చంద్రబాబు చేసిన నిర్వాహకం వల్ల వేలాది మంది లబ్ధిదారులు మండుటెండలో పింఛన్ కోసం నానా అవస్థలు పడ్డారు. ఏప్రిల్ 1వ తేదీన ఇవ్వాల్సిన పింఛన్ బ్యాంక్ సెలవుల కారణంగా ఏప్రిల్ 3వ తేదీన గ్రామసచివాలయాల ఉద్యోగుల ద్వారా పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వినుకొండ టౌన్ 12 సచివాలయాల పరిధిలో 5512, వినుకొండ రూరల్ మండలం 15 సచివాలయాల పరిధిలో 7914 మంది పింఛన్‌దారులు సాయంత్రం వరకు పింఛన్ కోసం ఎదురుచూశారు. ఏ సచివాలయం ముందు చూసినా ఇలాంటి దృశ్యాలే కనిపించాయి. చంద్రబాబు చేసిన కుట్రల మూలంగానే వలంటీర్లు పింఛన్‌లు ఇవ్వడం లేదని వారు వాపోతున్నారు. ముసలి అవ్వాతాతలు చెట్ల కింద కూర్చొని పింఛన్ ఎప్పుడు ఇస్తారయ్యా అంటూ అమాయకంగా అడుగుతూ కనిపించారు.

పింఛన్.. టెన్షన్...

రొంపిచర్ల: మండలంలో వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పెన్షన్‌ల పంపిణీ కార్యక్రమం బుధవారం సాయంత్రం ప్రారంభమైంది. వలంటీర్లు పింఛన్ల పంపిణీకి దూరంగా ఉంచారనే సమాచారం తెలిసి వారంతా ఉదయమే సచివాలయానికి తరలివచ్చారు.

కొన్ని సచివాలయాల్లో టెంట్‌లు, కుర్చీలు వేసి పింఛన్ దారులకు వసతి కల్పించగా మరికొన్ని సచివాలయాల్లో లోపలే పింఛన్ దారులు కూర్చునేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే సచివాలయానికి వచ్చిన వృద్ధులందరూ పింఛన్‌లు తీసుకోవటంలో ఏర్పడుతున్న అవాంతరాలపై ఒకరినొకరు చర్చించుకున్నారు. ఎక్కువ మంది పింఛన్ దారులు ఉన్న సచివాలయాల్లో పింఛన్ ఇవ్వటం ప్రారంభమైనా కూడా నాలుగు, ఐదు గంటల పాటు ఎదురు చూడాల్సి వచ్చింది.



నరసరావుపేటలో పింఛన్‌కోసం సచివాలయంకు వచ్చి వెళుతున్న వృద్ధులు



రొంపిచర్లలో పింఛన్ కోసం వచ్చి అష్టకష్టాలు పడుతున్న వృద్ధురాలు



నాదెండ్లలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్, తహసీల్దార్

పెన్షనర్లపై ప్రతిపక్షాలది కపట ప్రేమ

- వారి నిర్వాకం వల్లే వలంటీర్ల నిలుపుదల
- వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు కష్టాలు
- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్‌నాయుడు



వృద్ధులను పరామర్శిస్తున్న మనోహర్ నాయుడు

చిలకలూరిపేట: వలంటీర్లను పింఛన్ల పంపిణీ చేయకుండా ఫిర్యాదులు చేసి ఇప్పుడు పెన్షనర్లపై ప్రతిపక్ష నాయకులు కపటప్రేమ చూపిస్తున్నారని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని 35వ వార్డులో పార్టీ శ్రేణులతో కలసి బుధవారం ప్రచారం నిర్వహించారు. ఆయనకు స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలికారు. ముందుగా వార్డు పరిధిలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి వార్డులోని సుగాలీ కాలనీ, సాంబశివనగర్ ప్రాంతాల్లో పర్యటించారు. ఇంటింటికీ తిరిగి ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. గత ఐదేళ్ల పాలనలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, అందిన సంక్షేమ ఫలాల గురించి వివరించారు. ఈ సందర్భంగా కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ ప్రతినెలా ఒకటో తేదీన ఠంచన్‌గా అవ్వాతాతల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తున్న వలంటీర్లను నిలిపివేయాలని ప్రతిపక్ష టీడీపీ, జనసేన నాయకులే వారికి అనుకూలమైన వ్యక్తుల ద్వారా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారని చెప్పారు. ఇల్లు తగలబెట్టిన వారే మంటలు ఆర్పినట్లు నటిస్తూ ఫిర్యాదు చేసి, పింఛన్లను అడ్డుకోవాలని చూసినవారే అధికారుల వద్దకు వెళ్లి ఇంటింటికీ పింఛన్లు పంపిణీ చేసేలా అధికారులకు వినతి పత్రాలు అందజేయటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఈ చర్యతో పెత్తందార్ల పక్షాన ఉన్న ప్రతిపక్ష పార్టీల పేదల పట్ల ఉన్న కపట ప్రేమ బహిర్గతమైందన్నారు.

మురికిపూడిలో ప్రచారం...

రూరల్ మండలంలో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం ఆరంభమైంది. తొలిగా మురికిపూడి గ్రామం నుంచి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు ప్రారంభించారు. హారతులిస్తూ..బాణాసంచాకాలుస్తూ.. ఉత్సాహంగా గ్రామస్తులు, పార్టీ నాయకులు ఘనస్వాగతం పలికారు. ముందుగా గుడిలో పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని బ్రహ్మంగారి గుడి సెంటర్, మెయిన్ బజార్, ఎస్టీకాలనీ, బీసీ కాలనీలు, రెండు ఎస్సీకాలనీలలో పర్యటించారు.

ప్రలోభాలకు గురికావద్దు



ర్యాలీలో పాల్గొన్న తహసీల్దారు లక్ష్మి లావణ్య, ఎస్సై సురేష్

శావల్యాపురం: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్ల ప్రలోభాలకు గురికాకుండా తమ ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని తహసీల్దారు సక్కా లక్ష్మీ లావణ్య కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఓటు ఇది మీ హక్కు దృఢమైన ప్రజాస్వామ్యానికై తప్పనిసరిగా ఓటు వేద్దాం.. ఓటింగ్‌లో పాల్గొందాం అంటూ విద్యార్థులచే ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు ఓటు హక్కుపై ప్రజల్లో చైతన్యం పెంపొందించటానికి ఈ ర్యాలీ కార్యక్రమం ఎంతోగానో దోహదపడుతుందన్నారు. చైతన్యవంతమైన ప్రజాస్వామ్యానికి తప్పనిసరిగా ఓటు వేద్దాం. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. రాజకీయ నాయకుల ప్రలోభాలకు ఓటర్లు లొంగకుండా ఉండాలన్నారు. ర్యాలీలో ఎస్సై చల్లా సురేష్, డిప్యూటీ తహసీల్దార్లు వేముల వెంకట నాగరాజు, పెరిసోముల నాసరయ్య, వీఆర్వోలు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిలకలూరిపేటటౌన్: ఓటర్లు ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని చిలకలూరిపేట అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి బి.నారదముని చెప్పారు. బుధవారం పట్టణంలో ఏఎంజీ హైస్కూల్ నుండి చౌత్రా సెంటర్ వరకు ఓటర్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు ప్రతి ఒక్కరి హక్కు అని చెప్పారు. కార్యక్రమంలో రూరల్ నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఎం జ్వాలా నరసింహం, చిలకలూరిపేట అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి సీహెచ్ గోవిందరావు, యడ్లపాడు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి షేక్ అప్రవున్నిసాబేగం, బీఎల్‌వోలు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

5న ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు

నరసరావుపేట: రంజాన్ పర్వదినాలను పురస్కరించుకొని వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీ శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు ప్రకాష్‌నగర్‌లోని షాధీఖానా గ్రౌండ్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు అసెంబ్లీ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి బుధవారం పేర్కొన్నారు. పట్టణంలోని ముస్లింలు, న్యాయవాదులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

విద్యుదాఘాతమై భవన నిర్మాణ కార్మికుడికి గాయాలు



వినుకొండ టౌన్: భవన నిర్మాణ పనులు చేస్తుండగా, విద్యుత్ వైర్లు తగిలి భవన నిర్మాణ కార్మికుడికి తీవ్ర గాయాలైన సంఘటన పట్టణంలోని గాయత్రి నగర్‌లో బుధవారం చోటు చేసుకుంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు వినుకొండ రూరల్ వెంకుపాలెం గ్రామానికి చెందిన సాతులూరి మాణిక్యాలరావు పట్టణంలోని గాయత్రి నగర్ నందు (గుడిపాటి మాధవి నివాసంపై) ఇంటి నిర్మాణ పనులలో భాగంగా మేడపై సిమెంట్ పని చేస్తుండగా, ప్రమాదవశాత్తు భవనంపైనున్న హై వోల్టేజ్ కరెంట్ వైర్లకు తగిలి స్పృహ కోల్పోయాడు. గమనించిన భవన యజమానురాలు చికిత్స నిమిత్తం పట్టణంలోని ఓ ప్రవేట్ వైద్యశాలలో బాధితుడిని చేర్పించగా, మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించడం జరిగిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కాలువలపై గ్రిల్స్ ఏర్పాటు చేసుకోండి



నరసరావుపేట: షాపుల ముందు మురికి కాలువలపై సిమెంట్‌తో శాశ్వత నిర్మాణాలు చేయకుండా కాలువల్లోని పూడిక తీసేందుకు అనుగుణంగా గ్రిల్స్ ఏర్పాటు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ చింతా రవించంద్రా రెడ్డి పేర్కొన్నారు. బుధవారం 20, 21 వార్డుల్లోని వర్కర్స్ కాలనీ, పల్నాడు మెయిన్ రోడ్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా సంబంధిత వార్డు ప్రజలు కాలువల్లో మురుగునీరు పోవడం లేదని, ఆ నీరు రోడ్డుపై వస్తున్నాయని, నిర్మాణాలు చేసేవారు కాలువ పూడ్చడం వల్ల నీరు పోవడం లేదని ఫిర్యాదు చేశారు. దీనిపై తనతో ఉన్న ఇంజినీరింగ్ శానిటేషన్, టౌన్ ప్లానింగ్ విభాగ సిబ్బందిని భవనం ర్యాంపును బ్రేక్‌చేసి కాలువలు తీసేందుకు గ్రిల్స్‌ని ఏర్పాటు చేయాలని, శానిటేషన్ సిబ్బంది కాలువలో పూర్తిస్థాయిలో డీసిల్టు చేయమని ఆదేశించారు.

మూడు, నాలుగు వార్డుల్లో ఇఫ్తార్

పాల్గొని వడ్డించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి




ఇఫ్తార్ విందులో పాల్గొని వడ్డిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట: రంజాన్ పర్వదినాలను పురస్కరించుకొని పట్టణంలోని మూడు, నాల్గో వార్డుల్లో ముస్లిం సోదరులకు ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే, అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని విందును వడ్డించారు. వారందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని నాల్గవ వార్డు పనసతోట నవత ట్రాన్స్‌పోర్టు వద్ద వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. అలాగే మంగళవారం రాత్రి మూడో వార్డు నాయబ్‌బజారు వద్ద వార్డు ఇన్‌చార్జి సయ్యద్ ఖాజా, పెద్ద చెరువు నాయకుడు షేక్ వలిమేస్త్రి కలిసి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్.ఏ.హనీఫ్, షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషా బేగం ఖాజావలి, పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్మెంట్ అథార్టీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, మైనార్టీసెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ ఖాదర్‌బాషా, డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవరెడ్డి, గిరిజన కార్పొరేషన్ డైరక్టర్ పాలపర్తి వెంకటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు షేక్ మంజూరు, మాగులూరి రమణారెడ్డి, షేక్.జానిబాషా, షేక్ ఆజ్మల్ పాల్గొన్నారు.

జగనన్న హయాంలోనే వ్యాపారులకు స్వేచ్ఛ

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును సన్మానిస్తున్న అసోసియేషన్ నాయకులు

వినుకొండ(నూజెండ్ల): వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత స్వేచ్ఛగా వ్యాపారాలు నిర్వహిస్తున్నారని, వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం సహకారం అందిస్తోందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు స్పష్టం చేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వాసవీ కిరాణా మర్చంట్ అసోసియేషన్, మెడికల్ అసోసియేషన్, క్లాత్ రెడిమేడ్ అసోసియేషన్ సభ్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ వ్యాపార వర్గాలకు తమ అండదండలు ఎల్లప్పుడు ఉంటాయని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే బొల్లాను అసోసియేషన్ నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు, వ్యాపారస్తులు పాల్గొన్నారు.